బిజెపిని బొందపెడదాం

- కాషాయ జెండాను ఈ గడ్డపైన ఎగరనివ్వం
- కలిసికట్టుగా కమ్యూనిస్టుల స్ఫూర్తిని కొనసాగిద్దాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన ఈ గడ్డపై కాషాయ జెండాను ఎగరానివ్వకుండా తరిమి తరిమి కొడుతామని, గోల్కొండ కోటపై బొంద పెడుతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన సిపిఎం, సిపిఐ ఉమ్మడి సమావేశానికి ముఖ్య అతిధులుగా సిపిఎం, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శులు సీతారాం ఏచూరి, డి రాజా హాజరయ్యారు. ఆయా పార్టీల రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు అధ్యక్షత వర్గంగా జరిగిన సభకు మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ 'నీ బాంచన్ దొర.. నీ కాల్మొక్తా..' అన్న తెలంగాణ పేదవానికి ధైర్యం చెప్పి.. తెలివి నేర్పి.. బందుకూ చేత పట్టించి నాలుగు వేల మంది కమ్యూనిస్టులు అరుణతర్పణం గావించి, పదిలక్షల ఎకరాల భూమి పంచి.. నిజాంను గడగడలాడించి గద్దెదించిన చరిత్ర ఎర్రజెండాకు ఉందని గుర్తుచేశారు. అభ్యుదయ భావజాలం ఉన్నా ఇలాంటి గడ్డపై కాషాయ భావజాలం వస్తే మధ్యయుగం కాలం నాటికి వెళ్తామని ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాల్సిన అవసరముందన్నారు. కమ్యూనిస్టులకు సీట్లు ఉన్నాయా లేవా.. వారికి భవిష్యత్ ఉందా అనేది ముఖ్యం కాదని, వారు లేకపోతే ఈ దేశానికి భవిష్యత్తు ఉందా అనేది ఆలోచించాలని సూచించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రతిపాదించిన చరిత్ర కాంగ్రెస్‌ది కాదు.. కమ్యూనిస్టులదేనన్నారు. సమస్త సంపదకు మూలమైన అన్నింటినీ కేంద్రప్రభుత్వం కార్పొరేట్ పరం చేస్తోందన్నారు. ఒకే దేశం ఒకే టాక్స్ అని చెప్పే మోడీ ఎందుకు ఒకే కులం అని చెప్పడం లేదని ప్రశ్నించారు. ఈ దేశంలో చాతుర్వర్ణ వ్యవస్థ మళ్లీ రావాలని బిజెపి, ఆర్ఎస్ఎస్ కోరుకుంటున్నాయని తెలిపారు. ఏ కులం వాళ్లు ఆ కులవృత్తి చేసుకోవాలని చెప్పడమే బిజెపి సిద్ధాంతం అన్నారు. బిసి ప్రధాని అంటున్నారు.. కానీ బిసిలకు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దేశంలో అన్ని పార్టీలు కుల గణన జరగాలని చెబుతున్నా బిజెపి ఎందుకు చేయడం లేదన్నారు. కేంద్రీకరణ కాదు.. వికేంద్రీకరణ జరగాలని ప్రతిపాదించింది కమ్యూనిస్టు పార్టీలేనన్నారు. కెసిఆర్, ఇతర ప్రాంతీయ పార్టీలు కలసి వస్తున్నారు అంటే వారి అవసరాల కోసం, రాష్ట్రాల హక్కుల కోసమేన్నారు. శనివారం ప్రధాని రాష్ట్రానికి వచ్చి అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారని, అవినీతిపరులందరూ ఏకం అవుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్షల పోడు భూములకు పట్టాలిచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదని.. 11లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రజలను కష్టాల పాలు చేసి.. కన్నీళ్లు తెప్పిస్తే బిఆర్ఎస్‌పై రానున్న రోజుల్లో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కమ్యూనిస్టులు భావజాలం పరంగానే కాకుండా.. భౌతిక శక్తిగా ఎదగాలన్నారు. అందుకోసం మన ఐక్యత కీలకమని, మన మధ్య ఏమైనా విభేదాలున్నా.. బయటివాడు వస్తే మాత్రం.. మేమిద్దరం ఒక్కటవుతామని, ఎర్రజెండా శక్తి చూపిస్తామని స్పష్టంచేశారు.



సిపిఎం, సిపిఐ ఉమ్మడి సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని

జెండాలు ఒక్కటి చేసి కొట్లాడదాం
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

రెండు పార్టీల జెండాలు ఒక్కటి చేసి కొట్లాడదామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఈ రోజు ఒక పండుగ రోజు.. ఇది శుభోదయం.. ఒక అరుణోదయం అని అన్నారు. దేశానికి దశ, దిశ చూపిన పార్టీలు ఎర్రజెండాలే అని తెలిపారు. ఈ సమావేశం ఒక యూనిక్.. బతికి ఉన్నంత కాలం ఎర్రజెండాను మోద్దాం, చనిపోయాక జెండా కప్పుకొని చనిపోద్దామన్నారు. వాళ్లకు అవసరమొస్తే.. వాళ్లే మన దగ్గరకి వస్తున్నారన్నారు. బిజెపి జెండా మోసిన వాళ్లకి మనం దూరంగా ఉన్నామని చెప్పారు. వాళ్లంతట వాళ్లు వస్తేనే మద్దతు ఇస్తున్నామే.. తప్ప మనం ఎన్నడూ వాళ్ల వద్దకు వెళ్లలేదని గుర్తుచేశారు. సిపిఐ, సిపిఎం ఒక తల్లి పిల్లలేనని కూనంనేని గుర్తుచేశారు. కమ్యూనిస్టులు ఎవ్వరికీ లొంగరని.. లొంగితే ముఖ్యమంత్రులు అయ్యేవారన్నారు. తెలంగాణలో బిజెపిని అడుగుపెట్టనివ్వకుండా రెండు పార్టీలు కలిసి పోరాడుతాయని స్పష్టంచేశారు. ఈనెల 12వ తేదీన పూలే జయంతిని ఎస్‌వికెలో రెండు పార్టీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించండి

- అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్‌కు అదివారం ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించి తక్షణ చర్యల్లో భాగంగా సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని సిఎం సూచించారు. సంబంధిత ఏర్పాట్లు, కార్యాచరణకు చర్యలు చేపట్టాలని సిఎస్ శాంతి కుమారిని ఆదేశించారు. గతంలో నిర్వహించిన విధంగానే ఏడు వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నింటినీ ప్రారంభించాలని కోరారు. తద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా ప్రారంభించాలని సిఎం ఆదేశించారు.

ఫోన్ పోయింది

- కరీంనగర్ పోలీసులకు బండి సంజయ్ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన ఫోన్ పోయిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కరీంనగర్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. పదో తరగతి హిందీ ప్రశ్నా పత్రం బయటకు వచ్చిన వ్యవహారంలో ఈ నెల 5న సంజయ్ అరెస్టు సమయంలో పోలీసులకు, బిజెపి కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో తన ఫోన్ పడిపోయినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు మెయిల్ ద్వారా కరీంనగర్ పోలీసులకు బండి సంజయ్ ఫిర్యాదు పంపారు.

ఫోన్ చుట్టూ రాజకీయం..

హిందీ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్ చుట్టూ రాజకీయం నడుస్తోంది."ఎంపి బండి సంజయ్‌ను ఫోన్ గురించి అడిగితే లేదన్నారు. ఎక్కడుందంటే తెలియదంటున్నారు. ఫోన్ ఇస్తే కీలక సమాచారం బయటకు వస్తుందని వారికి తెలుసు. అందుకే ఫోన్ ఇవ్వట్లేదు. అయినా.. బండి సంజయ్ ఫోన్‌కాల్ డేటా సేకరిస్తాం. పేపర్ షేర్ అయిన అందరికీ ప్రశాంత్ ఫోన్ చేయలేదు. పిల్లల సాయంతో ప్రశ్నాపత్రం బయటకు తెచ్చుకున్నారు. కొన్ని ఫోన్లలో మెసేజ్‌లు డిలీట్ చేశారు.. వాటిని రిట్రైవ్ చేయాలి. కాల్ డేటా సేకరించాల్సి ఉంది. ఎలాంటి కుట్ర చేయకపోతే బండి సంజయ్ ఫోన్ ఇవ్వొచ్చు కదా?" అని ఇటీవల వరంగల్ సిపి రంగనాథ్ మీడియా సమావేశంలో చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన ఫోన్ పోయిందంటూ బండి సంజయ్ పోలీసులకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఎస్ఐ రాత పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సబ్‌ఇన్‌స్పెక్టర్, ఎఎస్ఐ పోస్టులకు తుది రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 96 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారనీ, రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వివి.శ్రీనివాస్‌రావు తెలిపారు. 8, 9 తేదీల్లో రెండురోజులపాటు ఈ రాత పరీక్షను నిర్వహించామనీ, అందులో 8న 59,545 మంది అభ్యర్థులు హాజరుకాగా.. చివరి రోజు పరీక్షకు 58 వేల మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. ఎస్ఐ పోస్టులకు జరిగిన వివిధ తుది రాత పరీక్షలకు సంబంధించిన తుది 'కీ' ని త్వరలోనే విడుదల చేస్తామని చెప్పారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో కలిపి మొత్తం 81 పరీక్ష కేంద్రాల్లో తుది రాత పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.

ముస్లింల తెలుగు శాసనాలు మత సామరస్యానికి ప్రతీకలు

మంత్రి శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ముస్లిం పాలన ప్రారంభ కాలం నుంచి అసఫ్ జాహీ రాజుల చివరి వరకు తెలంగాణలో మత సామరస్యం వెల్లివిరిసిందని రాష్ట్ర మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ భాషా సాంస్కతిక శాఖ ముద్రించిన, చరిత్ర పరిశోధకులు ఈమని శివనాగిరెడ్డి రచించిన "తెలంగాణ ముస్లిం పాలకులు - తెలుగు శాసనాలు" పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి అవిష్కరించారు. భాషా సాంస్కతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ పుస్తకాన్ని పరిచయం చేశారు.



ప్రజాప్రతినిధికి నిలువెత్తు రూపం రాఘవరెడ్డి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

- ఫ్లోరైడ్ విముక్తి పోరాటంలో కీలకపాత్ర పోషించిన నర్రా
- సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజమైన ప్రజాప్రతినిధి అంటే ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, అలాంటి నాయకుల్లో నర్రా రాఘవరెడ్డి ఒకరని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఎంవిఎన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నర్రా రాఘవరెడ్డి ఎనిమిదో వర్ధంతి సభ ఆ ట్రస్టు కార్యనిర్వాహక కార్యదర్శి పి నర్సిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. నేటితరం నర్రారాఘవరెడ్డి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధి అంటే నర్రా రాఘవరెడ్డి లాగా నిబద్ధత కలిగి ప్రజల్లో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. నర్రాతో తనకు ప్రత్యక్ష అనుబంధం ఉందని, ఉపాధ్యాయ సంఘం నాయకుడిగా ఉన్నప్పుడు జిల్లా పరిషత్‌లో ఒక ఉపాధ్యాయుడి బదిలీ విషయంలో జెడ్‌పి సిఇఓతో మాట్లాడి పరిష్కరించారని గుర్తు చేశారు. తన జీవితమంతా పోరాటాలు, సమస్యలతో కూడుకున్నప్పటికీ నమ్ముకున్న ఆశయం కోసం కడదాకా నిలబడ్డారని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫ్లోరైడ్ విముక్తి పోరాటంలో, ఎస్ఎల్‌బిసి సొరంగం కోసం సాగిన పోరాటంలో నర్రా ప్రముఖులని కొనియాడారు. చట్టసభల్లో ఇప్పుడు జరుగుతున్న చర్చలులాగా ఆరోజుల్లో లేవని, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు కొన్ని ప్రత్యేక నిర్ణయాలు తీసుకున్నప్పుడు నిర్భయంగా ఆ నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని రాఘవరెడ్డి కోరారని తెలిపారు. నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ విముక్తి చేయాలనే తపనతోనే ఎస్-ఎల్‌బిసి సొరంగం అయితే ఆలస్యం అవుతుందని నార్ల తాతారావు వెంటబెట్టుకుని ఎన్‌టి రామారావు దగ్గరికి తీసుకెళ్లి లిఫ్ట్ ద్వారా పూర్తి చేయాలని సూచించారు. ఏ విషయాన్నైనా కులంకుషంగా చర్చించి పరిష్కరించే వారిని, ప్రజా సమస్యలను తన సమస్యగా భావించి పరిష్కరించిన మహనీయుడని కొనియాడారు. అమరజీవి పేరుతో షుగర్, బీపీ, ఫిట్స్, పక్షవాతం రోగులకు మందులు ఇస్తున్నామని చెప్పారు. తమ సంస్థ చేపట్టే కార్యకలాపాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఎంవిఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కెసిఆర్ సారూ.. పెన్షన్‌లు ఇప్పించండి

- పోస్టుకార్డులు పంపిన బీడీ కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తమకు జీవన భృతి (పెన్షన్) రావడం లేదని, వెంటనే అందజేయాలని కోరుతూ సిఎం కెసిఆర్‌కు బీడీ కార్మికులు పోస్టుకార్డులు పంపారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం ఎండ్రియాల్ గ్రామంలో వార్డు మెంబర్ తిరుపత్తిరెడ్డితో కలిసి పలువురు బీడీ కార్మికులు సిఎం కెసిఆర్‌కు పోస్టాఫీస్ నుంచి లేఖలను పంపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. బీడీ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడుస్తున్నా పెన్షన్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, ధర్నాలు, నిరసనలు చేపట్టినా తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. పెన్షన్ వస్తే తమకు ఆసరాగా నిలుస్తుందని, కాబట్టి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. సిఎం కెసిఆర్‌తో పాటు సీఎం కార్యాలయానికి సైతం పోస్టుకార్డులను పంపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో.. ముగ్గురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి నుంచి మేడ్చల్ వైపు వేగంగా వెళున్న కారు ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.


మరో ఘటనలో ఎంఆర్‌సిఇటి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ 4వ సంవత్సరం చదువుతున్న సుస్వాంత్ నాయక్ (23) అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో దూలపల్లి నుంచి బహదూర్ పల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అతని వాహనం ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

సిపిఆర్ నేర్చుకుందాం.. ప్రాణాలను కాపాడుదాం

- ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఆర్ నేర్చుకుంటే 50 శాతం మందిని బతికించొచ్చని, కార్డియాక్ అరెస్టుతో స్పృహ కోల్పోయిన వ్యక్తులను సిపిఆర్ విధానంతో తిరిగి స్పృహలోకి తీసుకురావొచ్చని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దేశ వ్యాప్తంగా రెండు శాతం మందికి మాత్రమే సిపిఆర్‌పై అవగాహన ఉందని, కాబట్టి అందరం సిపిఆర్ నేర్చుకుని ప్రతి ప్రాణాన్ని కాపాడదామని పిలుపునిచ్చారు. సిద్దిపేటలోని పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సిపిఆర్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి హాజరై.. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సిద్ధిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ మంత్రి సమక్షంలో స్వయంగా సిపిఆర్ చేసి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సడెన్ కార్డియాక్ అరెస్టుతో దేశంలో 15 లక్షల మంది, రాష్ట్రంలో నాలుగు వేల మంది చనిపోతున్నారన్నారు. దేశ వ్యాప్తంగా రెండు శాతం మందికి మాత్రమే సిపిఆర్‌పై అవగాహన ఉందని, కాబట్టి అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సిపిఆర్ శిక్షణా కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. హార్ట్‌ఎటాక్, సడెన్ కార్డియాక్ అరెస్ట్ వేర్వేరుగా ఉంటాయని, కార్డియాక్ అరెస్ట్ అనేది శ్వాస ఆడకపోవడం, పల్స్ లేకపోవడంగా ఉంటుందన్నారు. రూ.15 కోట్లతో ఎఇడి మిషన్లు ఆస్పత్రుల్లో అందుబాటులోకి తెస్తామని, మున్సిపల్ చట్టాల్లో సవరణ చేసి, అపార్టుమెంట్‌లకు అనుమతులు ఇచ్చినప్పుడు ఎఇడి మిషన్లు ఏర్పాటు చేయాలని చెబుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణలో ప్రతి బ్యాచ్‌లో 20 మంది చొప్పున 1826 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశామని, మొత్తం 36,500 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. సిద్ధిపేట జిల్లా తరహాలోనే పోలీస్ హెల్త్ ప్రొఫైల్ మిగతా అన్ని జిల్లాల్లో నిర్వహిస్తామన్నారు. ఇటీవల సిపిఆర్ చేసి విలువైన ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిని మంత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ రోజాశర్మ, గిడ్డంగి కార్పొరేషన్ చైర్మెన్ సాయిచంద్, పోలీసు కమిషనర్ శ్వేత, డిఎంహెచ్ఒ డాక్టర్ కాశీనాథ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



సిపిఆర్ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

రాజ్యాంగ రక్షణకు ఉద్యమం తప్పదు

- ప్రజాస్వామ్యానికి ప్రమాదం వాటిల్లుతోంది
- ఆప్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆమ్ ఆద్మి పార్టీ ఆధ్వర్యంలో 'మోడీ హటావో-దేశ్‌కి బచావో' నినాదంతో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దిడ్డి సుధాకర్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ 2014లో మోడీ అధికారంలోకి వచ్చే ముందు ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేశారని గుర్తుచేశారు. నల్ల ధనాన్ని బయటకు తెస్తాం.. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామనే వాగ్దానాలెన్నో చేసి ఇప్పుడు చేతులెత్తేరని విమర్శించారు. ఇలాంటి అంశాల నుంచి ప్రజల ఆలోచనల్ని పక్కదారి పట్టించేందుకు బిజెపి భావోద్వేగాలను రెచ్చగొట్టి పబ్బం గుడుపుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతికి వ్యతిరేకమంటూ గప్పాలు కొట్టే మోడీ ప్రభుత్వం రాహుల్ గాంధీ అదాని గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఎందుకు చెప్పటం లేదని నిలదీశారు. రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థలను పార్టీ ప్రయోజనాలకు వాడుకోవద్దని హితవు పలికారు. సుధాకర్ మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అసలు సమస్యలన్నీ పక్కనపెట్టి, దైవభక్తి, దేశభక్తి పేరుతో దేశాన్ని రెండు ముక్కలుగా చీల్చుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఎస్ఎల్ పద్మ మాట్లాడుతూ దేశంలో కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావుల తదితరులను పక్కదారి పట్టించడంలో మోడీ అగ్రభాగాన ఉన్నారని తెలిపారు. రాజ్యాంగ బద్ధ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నదన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చేసి దాని స్థానంలో మనుస్మృతిని ప్రవేశ పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు ఎంఆర్‌జి వినోద్ రెడ్డి, ఆఫ్ కోర్ కమిటీ సభ్యులు భూక్యా శోభన్‌బాబు, బుర్ర రాములు గౌడ్ పాల్గొన్నారు.



నల్లగొండలో కులదురహంకార హత్య

- వేటకొడవళ్లతో దారుణంగా నరికి చంపిన దుండగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రేమ వ్యవహారం ఓ యువకుడి ప్రాణం తీసింది. కులోన్మాదంతో అమ్మాయి బంధువులు పథకం ప్రకారం యువకున్ని దారుణంగా వెంబడించి వేట కొడవళ్లతో నరికి చంపారు. ఈ ఘటన ఆదివారం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం గుంటిపల్లి గ్రామ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారం గ్రామానికి చెందిన దళిత సామాజిక తరగతికి చెందిన ఇరుగు నవీన్ (24) అదే గ్రామానికి చెందిన యువతి.. రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమ వ్యవహారం అమ్మాయి ఇంట్లో తెలవడంతో ఆమెని నవీన్‌ను కలవకుండా కుటుంబ సభ్యులు కట్టడి చేసి పెళ్లి చేసేందుకు యత్నిస్తున్నారు. ఈ విషయంలో ఆమె కుటుంబసభ్యులు నవీన్‌ను పలుమార్లు బెదిరించారు. దాంతో యువకుడు రెండు నెలలుగా మిర్యాలగూడలోని ఓ మెకానిక్ షాపులో పనిచేస్తున్నాడు. ఆదివారం తల్లి దండ్రులను చూసేందుకు మిర్యాలగూడ నుంచి గ్రామానికి వచ్చే క్రమంలో గుంటిపల్లి వద్ద తన స్నేహితుడు ఈట అనిల్‌ని కలిసేందుకు ఆగాడు. గుంటిపల్లి అన్నారంకు చెందిన ఓ వ్యక్తి నవీన్‌కు ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావని అడుగగా.. తాను స్నేహితునితో కలిసి మద్యం సేవిస్తున్నానని చెప్పాడు. అనంతరం ఫోన్ చేసిన వ్యక్తి అమ్మాయి బంధువులైన తొమ్మిదిమంది కలిసి మారణాయు ధాలతో మూడు ద్విచక్ర వాహనాలపై గుంటిపల్లికి వచ్చి నవీన్‌పై దాడి చేశారు. ఈ క్రమంలో అనిల్ తప్పించుకు న్నాడు. కానీ నవీన్‌ను మాత్రం వేడకొడవళ్లతో వెంబడించి దారుణంగా నరికి చంపారు. విషయం తెలుసుకున్న పోలీసులు డాగ్‌స్క్వాడ్ బృందాలను రప్పించి క్లూస్‌టీం ద్వారా ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుతాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనాస్థలాన్ని డిఎస్‌పి వెంకటగిరి పరిశీలించారు. మృతుని స్నేహితుడు ఈట అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ గాంధీనాయక్, ఎస్ఐ శోభన్‌బాబు కేసు నమోదు చేశారు.

విద్యార్థుల విషయంలో రాజకీయం సరికాదు

- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ నాయకులు విద్యార్థుల విషయాలపై రాజకీయాలు చేయడం సరికాదని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో విద్యార్థిని ప్రసవించిన విషయంలో కాంగ్రెస్ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడడం సబబు కాదన్నారు. విద్యార్థిని ప్రసవంపై కళాశాల ప్రిన్సిపాల్, డిప్యూటీవార్డెన్, నర్సులను ప్రభుత్వం సస్పెండ్ చేసిందన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ నాయకులు విద్యార్థినుల జీవితాలను పనంగా పెట్టే ప్రయత్నాలు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రుబీనాబేగంనజీబ్, వైస్ ఛైర్మన్ పరశురాం, కౌన్సిలర్ మాజీద్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు లాయక్, సాబేరాబేగం, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ బాసిత్, కంగ్టి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గంగారాం, ఖేడ్ పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడు గౌస్, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కాగా నారాయణఖేడ్ ప్రాంతంలోని వివి?ధ గ్రామాలకు చెందిన 12 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మిబాయిరరవీందర్‌నాయక్, ఎంపీటీసీ నారాయణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

విడివిడిగా కాదు.. కలివిడిగా...

- బిజెపిపై సమరానికి సిపిఐ, సిపిఎం సన్నద్ధం
- ఆ దిశగా ఉభయ పార్టీల శ్రేణులకు నేతల నిర్దేశం
- కార్యకర్తలు, నాయకుల్లో సమరోత్సాహాన్ని నింపిన నాంపల్లి సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఏయ్ బిడ్డా.. ఇది తెలంగాణ సాయుధ పోరాట గడ్డ... ఎర్రజెండా అడ్డా...' అన్నట్టుగా సిపిఐ, సిపిఎం శ్రేణులు భారీ సంఖ్యలో అక్కడికి కదిలొచ్చాయి. 'ఇప్పటిదాకా ఒక లెక్క.. ఇప్పటి నుంచి మరో లెక్క...' అనే రీతిలో కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలపై కలిసికట్టుగా సమరశంఖం పూరించాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం వేదికగా ఆదివారం నిర్వహించిన సిపిఐ, సిపిఎం క్రియాశీల కార్యకర్తల సమావేశం విజయవంతమైంది. దేశంలోనే తొలిసారిగా నిర్వహించిన ఈ సభ యావత్ భారత కమ్యూనిస్టు ఉద్యమానికే 'మొదటి అడుగు'గా అగ్రనేతలు సీతారాం ఏచూరి, డి రాజా అభివర్ణించారంటే ఆ సభ ఎంతటి ప్రాధాన్యతను సంతరించుకున్నదనే విషయం విదితమవుతోంది. దేశంలో మొదటి నుంచి లౌకికవాదం, ప్రజాస్వామ్యం, ఆర్థిక సార్వభౌమత్వం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం నికరంగా పోరాడుతున్న సిపిఐ, సిపిఎం... సంయుక్తంగా ఇప్పుడు ఒక బృహత్తర కర్తవ్యాన్ని భుజాన వేసుకోవాలంటూ ఈ సభ పిలుపునిచ్చింది. బిజెపి నుంచి దేశాన్ని రక్షించటమే ఆ బాధ్యతంటూ నొక్కి చెప్పింది. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు పూనుకోకపోతే ఆ బాధ్యతను నెరవేర్చే వారే ఉండబోరంటూ సమావేశం హెచ్చరించింది. ఇతర బూర్జువా పార్టీలు తమ అవసరార్థం, రాజకీయ ప్రయోజనాలరీత్యా, సందర్భానుసారంగా దేశం గురించి, రాజ్యాంగం గురించి చెప్పినా.. ఆ సమున్నత లక్ష్యాల కోసం రాజీలేని పోరు సల్పేది మాత్రం ఎర్రజెండాలేనని స్పష్టం చేసింది. ఆరెస్సెస్ అజెండాను, దాని మూల సూత్రమైన మనువాదాన్ని తూ.చా. తప్పకుండా అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్న బిజెపి భావజాలాన్ని సైద్ధాంతికంగా తిప్పికొట్టగలిగేది కమ్యూనిస్టులు మాత్రమేనని స్పష్టం చేసింది. ఇదే సమయంలో కేవలం భావజాలపరంగానే కాకుండా తెలంగాణలో భౌతికంగానూ ఎదిగేందుకు కృషి చేయాలంటూ జిల్లా, మండల స్థాయి నాయకులకు సమావేశం ఉద్బోధించింది. ఈ నేపథ్యంలో అగ్రనేతల పిలుపునందుకుని ఉభయ కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలు కదనరంగంలోకి దూకారు. తమకిచ్చిన కర్తవ్యాలను భుజాన వేసుకుని సొంతూళ్లకు పయనమయ్యారు. ఆద్యంతం అత్యంత ఉత్సాహ, ఉద్వేగపూరిత వాతావరణంలో కొనసాగిన ఈ సభలో 'సుత్తీ, కంకి కొడవళ్లు ' ఒక్కటిగా మెరిశాయి. ఎర్రజెండాలు రెపరెపలాడాయి.

కార్మికవర్గ ఐక్యతతోనే..

పాలకుల విధానాలను తిప్పి కొట్టగలం

- శాండ్విక్ యూనియన్ మాజీ అధ్యక్షులు సుధాభాస్కర్
- కార్మిక సంక్షేమం కోసం అనునిత్యం కృషి : చుక్క రాములు
- శాండ్విక్ పరిశ్రమలో ఘనంగా యూనియన్ 39వ వ్యవస్థాపక దినోత్సవం



శాండ్విక్ పరిశ్రమ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధాభాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికవర్గ ఐక్యతతోనే పాలకుల విధానాలను తిప్పి కొట్టగలమని శాండ్విక్ యూనియన్ మాజీ అధ్యక్షులు, నవతెలంగాణ పత్రిక సంపాదకులు ఆర్ సుధాభాస్కర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ పరిశ్రమలో ఆదివారం జరిగిన కంపెనీ ఎంప్లాయీస్ యూనియన్ 39వ వ్యవస్థాపక దినోత్సవంలో యూనియన్ అధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములుతో కలిసి సుధాభాస్కర్ పాల్గొని సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సుధాభాస్కర్ మాట్లాడుతూ.. 1985 ఏప్రిల్ తొమ్మిదిన సిఐటియుకి అనుబంధంగా స్థాపించిన శాండ్విక్ ఎంప్లాయీస్ యూనియన్ (అప్పటి విడియా ఎంప్లాయీస్ యూనియన్) కార్మికులను ఐక్యంగా ఉంచడానికి సిద్ధాంత ప్రాముఖ్యత ప్రధాన కారణమన్నారు. అమెరికా నాటో విస్తరణ స్వార్థం మూలకంగా రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వచ్చిందని, ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత అతలాకుతలం చేసిందన్నారు. భారతదేశంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు పెట్టుబడిదారులు కార్మికవర్గాన్ని మరింత దోపిడీ చేయడానికి ఉపయోగ పడుతున్నదని ఆరోపించారు. కార్మికవర్గ ఐక్యత ద్వారా వీటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

చుక్క రాములు మాట్లాడుతూ.. ఎన్ని యాజమాన్యాలు మారినా ఐక్యతను కాపాడుకుంటూ కార్మిక సంక్షేమానికి అనునిత్యం కృషిచేస్తూ 39 ఏళ్లుగా యూనియన్‌ను కాపాడుకుంటూ వచ్చామన్నారు. మన బేరసారాల శక్తి తగ్గిపోకుండా కాపాడుకోవడం మన తక్షణ కర్తవ్యమన్నారు. గరిష్టస్థాయిలో కార్మికుల సంఘటిత శక్తిని నిర్మించుకోవడానికి ప్రతి ఒక్క సభ్యుడు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా మాజీ, ప్రస్తుత ఆఫీస్ బేరర్స్ కమిటీ సభ్యులను సత్కరించారు. అనంతరం నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.పాండురంగా రెడ్డి, ఎం మనోహర్, ఎ వీరారావు, హెచ్ వెంకట్రావు, వి సదాశివరెడ్డి, ఎస్ త్రిలోచన్ కుమార్, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

అక్టోబర్ పదిన వరంగల్‌లో బిఆర్ఎస్ మహాసభ

- ఈనెల 27న తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో విస్తృతంగా భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు చేపట్టేందుకు ఆ పార్టీ సమాయత్తమవుతోంది. రాజకీయ వాతావరణం వేడెక్కుతున్న నేపథ్యంలో ఈ నెల 27న పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించనుంది. ఈ మేరకు బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. 27వ తేదీన పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ అధ్యక్షతన జరగనున్న బిఆర్ఎస్ సర్వసభ్య సమావేశంలో పలు రాజకీయ తీర్మానాలు ప్రవేశపెట్టి, చర్చించనుంది. ఏప్రిల్ 25వ తేదీన నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సమావేశాలు జరగనున్నాయి. అక్టోబరు పదిన వరంగల్‌లో బిఆర్ఎస్ భారీ మహాసభ నిర్వహించాలని అధిష్ఠానం నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించుకుంటున్న బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాల కార్యక్రమాలకు పార్టీ శ్రేణుల నుంచి మంచి స్పందన వస్తోందని మంత్రి కెటిఆర్ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 25న నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సభలు నిర్వహించుకోవాలని... ఈ సమావేశాలు పార్టీ నియమించిన ఇంఛార్జ్‌లు, స్థానిక ఎమ్మెల్యేల అధ్యక్షతన కొనసాగుతుందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు ఈ సమావేశాల నిర్వహణను సమన్వయం చేస్తారని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో అన్నీ గ్రామాలు, వార్డుల్లో ఆ రోజు ఉదయమే పండగ వాతావరణంలో పార్టీ జెండాలు ఎగరవేయాలని, గ్రామాలు, వార్డుల్లో జెండా పండుగ కార్యక్రమం ముగించుకుని ఉదయం పది గంటల కల్లా నియోజకవర్గ కేంద్రాల్లో ప్రతినిధులు సభ సమావేశ స్థలికి చేరుకోవాలని పార్టీ శ్రేణులను కోరారు. సమావేశాలకు హాజరయ్యే పార్టీ ప్రతినిధులకు అవసరమైన భోజనాలు, ఇతర వసతులు ఏర్పాటు చేయాలని, వేసవికాలం నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఇంఛార్జ్‌లకు కేటీఆర్ సూచించారు.

మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇంఛార్జ్‌లు..

మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇంఛార్జ్‌లను కెసిఆర్ నియమించారు. కంటోన్మెంట్ అసెంబ్లీ ఇంఛార్జ్‌గా మర్రి రాజశేఖర్ రెడ్డి, గోషామహల్ నియోజకవర్గం ఇంఛార్జ్‌గా నంద కిషోర్ వ్యాస్ బిలాల్, భద్రాచలం నియోజకవర్గ ఇంఛార్జ్‌గా ఎంపి మాలోతు కవితలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరు ప్రస్తుతం కొనసాగుతున్న ఆత్మీయ సమ్మేళనాలతోపాటు భారాస ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల నిర్వహణ, నియోజకవర్గాలకు బాధ్యులుగా కొనసాగుతారు.

వచ్చే ఎన్నికల్లో

కాంగ్రెస్ పార్టీదే అధికారం

- మాజీ మంత్రి ప్రసాద్ కుమార్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ అన్నారు. ఆదివారం బంట్వారం మండలం మంగ్రాసపల్లిలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కాంగ్రెస్ పేదలను ఆదుకునే పార్టీ అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే పేద ప్రజల కు మేలు జరిగిందన్నారు.

రాష్ట్రంలో కేసీఆర్‌ను గద్దె దించేందుకు ప్రతి ఒక్కరు ఏకం కావాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని కేసీఆర్ గుర్తు చేసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో బీఆర్ఎస్ పార్టీని, బీజేపీని అంతం చేయాలని ఆయన కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం బంట్వారం మాజీ సర్పంచ్ చంద్రకళసిద్ధిరాములు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంంలో కిసాన్ సెల్‌అధ్యక్షుడు రత్నారెడ్డి, సినియర్ నాయకులు ఛామల రఘుపతి రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, బంట్వారం ఎంపీటీసీ పద్మవెంకటేశం, నాయకులు, రవీందర్ రెడ్డి, సంగమేశ్వర్, శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి, , తోఫిక్ పాషా, రాజు, వీరేశం, పురుషోత్తం రెడ్డి, రాములు, రాజు, యాదగిరి, రామక్రిష్ణారెడ్డి, ఆశిరెడ్డి, శంకర్ యాదవ్ పాల్గొన్నారు.

పిఎఫ్ఆర్‌డిఎ చట్టాన్ని రద్దు చేయాల్సిందే

- పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి
- మరో ప్రత్యామ్నాయాన్ని అంగీకరించేది లేదు
- టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పిఎఫ్ఆర్‌డిఎ) చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేయాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) డిమాండ్ చేసింది. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగులు, ఉపాధ్యాయులను మరోసారి వంచించే ప్రయత్నంలో భాగంగానే కంతితుడుపు చర్యగా కేంద్రం కమిటీ వేసే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండించింది. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరింది. మరో ప్రత్యామ్నాయాన్ని అంగీకరించేది లేదని స్పష్టం చేసింది. పే రివిజన్ కమిషన్ (పిఆర్‌సి)ని తక్షణమే నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను మంజూరు చేయాలని డిమాండ్ చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం-2020 పేరుతో పాఠశాలల్లో విద్యార్థుల నమోదును ఆరేండ్లు నిండిన తర్వాతే చేర్చుకోవాలంటూ పేర్కొనడం సరైంది కాదన్నారు. ఇది విద్యార్థులను ప్రయివేటు బడులవైపు మళ్లించడం తప్ప మరొకటి కాదని చెప్పారు. ప్రీప్రైమరీ తరగతులను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తామని, ఆరేండ్లు నిండిన వారిని ఒకటో తరగతిలో చేర్చుకోవాలని చెప్పడం ద్వారా కేజీ తరగతుల పేరుతో నిర్వహిస్తున్న కార్పొరేట్ పాఠశాలలకు చట్టబద్ధత వచ్చినట్లవుతుందని విమర్శించారు.

నూతన విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు చేయకుండా చూసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. అధ్యక్షత వహించిన టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య మాట్లాడుతూ కేంద్రం ఎన్‌సిఆర్‌టి పుస్తకాల్లో చరిత్రకు సంబంధించిన పాఠ్యాంశాలను తొలగిస్తూ వారి ఎజెండాలో భాగంగా ఉన్న మతపరమైన అంశాలను చొప్పించడం దేశ మౌలిక సూత్రాలకు భంగం కలిగే అవకాశముందన్నారు. టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన సవరణ ఆసన్నమైందని చెప్పారు. వెంటనే పిఆర్‌సి కమిటీని నియమించాలని కోరారు. ఈ ఏడాది, జులై నుంచే కొత్త పీఆర్సీ అమలు కావాల్సి ఉన్నందున ఉద్యోగ, ఉపాధ్యాయులు గత పీఆర్సీలాగా నష్టపోతామంటూ ఆందోళన చెందుతున్నారని అన్నారు. పీఆర్సీని ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, పదోన్నతులు, బదిలీలకు సంబంధించి కోర్టులో ఉన్న స్టేను ఖాళీ చేయించడానికి ప్రభుత్వం చొరవ చూపాలని, వాటిని వేసవి సెలవుల్లోనే చేపట్టాలని, అన్ని గురుకుల సొసైటీలను ఒకే డైరెక్టరేట్ పరిధిలోకి తెచ్చి ఒకే టైంటేబుల్ వర్తింపచేయాలని, పారిటీ స్కేల్‌ను అమలు చేయాలని, వాటిలోని ఉపాధ్యాయులకు 70:30 దామాషాలో పదోన్నతులు, బదిలీలు జీవోనెంబర్ 317ను అమలు చేయాలని, మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టేలా, కోర్టు ఆటంకాలను తొలగించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, గురుకుల, మోడల్ స్కూల్, కేజీబీవీ సిబ్బందికి ఈహెచ్ఎస్ పథకాన్ని అమలు చేయాలని, కేజీబీవీ టీచర్లకు బేసిక్ పేను వేతనంగా చెల్లించాలంటూ తీర్మానాన్ని ఆమోదించారు.



శివారెడ్డిని సత్కరిస్తున్న వక్తలు

నృత్య సంగీత భరితంగా భారత్ ఆర్ట్స్ అకాడెమీ దశాబ్ది వేడుక

ప్రజాశక్తి - కల్చరల్

తరచు వివిధ సందర్భాలలో పలు పండుగల సమయంలో చిన్నారులకు యువతకు నృత్య సంగీత ప్రదర్శనలకు వేదిక కల్పించి ప్రోత్సాహిస్తున్న భారత్ ఆర్ట్స్ అకాడమీ ఎబిసి ఫౌండేషన్ సాంస్కృతిక రంగ సేవ విశేషమని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా ప్రశంసించారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై భారత్ ఆర్ట్స్ అకాడమీ ఎబిసి ఫౌండేషన్ దశాబ్ది వార్షిక వేడుక సంగీత నృత్య సహితంగా జరిగాయి. భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు కెవి రమణారావు అధ్యక్షతన జరిగిన సభా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దామోదర్ పాల్గొని మాట్లాడుతూ సంస్థకే దేశం పేరు పెట్టుకొని శాస్త్రీయ సంప్రదయ కళల వ్యాప్తికి తమ వంతు కృషి చేస్తున్న భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు లలితా రావును అభినందించారు. మిమిక్రీ కళాకారుడు, నటుడు శివా రెడ్డి అతిథిగా పాల్గొని భారత్ ప్రతిభ పురస్కార్ సత్కారం పొంది మాట్లాడుతూ పది సంవత్సరాలు ఇట్టి యాంత్రిక యుగంలో సంప్రదాయ కళలకు జాన పదానికి ప్రాధాన్యత ఇస్తూ సంస్థను నిర్యాహించడం సులువు కాదని అన్నారు. చకిలం స్వప్న, ఫారీద్, నృత్య గురువులు పాల్గొన్నారు. మధు బాబు, కిరణ్మయి, రేవతి, శృతి, మౌనిక, సతీష్, ప్రసాద్ తదితరులకు గురు సమ్రాట్, సంగీత గురువులకు గానగాంధర్వ అవార్డులను అతిథులు బహుకరించారు. లలిత రావు కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేశారు. మాగంటి వసుధ, విష్ణు తేజలు వ్యాఖ్యానం చేశారు.



బిఆర్ఎస్‌పై ప్రధాని విమర్శలు సరికాదు

- బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేశవరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధికారిక కార్యక్రమంలో బిఆర్ఎస్‌పై, నేతలపై అవహేళనగా మాట్లాడడం సరికాదని బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేశవరావు మండిపడ్డారు. బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కెకెతోపాటు బిఆర్ఎస్ ఎంపీలు కెఆర్ సురేష్‌రెడ్డి, వెంకటేశ్ మీడియా సమావేశం నిర్వహించారు. కేశవరావు మాట్లాడుతూ... తెలంగాణలో అభివృద్ధి జరగడం లేదనడం సరికాదన్నారు. రాష్ట్రంలో జరిగినంత అభివృద్ధి దేశంలో ఎక్కడా జరగలేదని స్పష్టం చేశారు. ఎపి పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను కేంద్రం నెరవేర్చలేదని మండిపడ్డారు. కేంద్రం ఒక్క వైద్య కళాశాల ఇవ్వనప్పటికీ.. ప్రతి జిల్లాలో ఒక వైద్య కళాశాల ఇచ్చేదిశగా కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే 18 మెడికల్ కళాశాలలు మంజూరు చేశామన్నారు. కేంద్రం.. రాష్ట్రానికి రాజ్యాంగబద్ధంగా రావాల్సిన నిధులును మాత్రమే కేటాయించింది తప్ప ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదన్నారు. కేంద్రంలో మెజారిటీ ఉందనే అహంభావంతో బిజెపి ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తోందన్నారు. సిఎం కెసిఆర్ ప్రధాని మోదీ అధికారిక కార్యక్రమంలో పాల్గొనలేదంటున్న బిజెపి నేతలు గతాన్ని కూడా గుర్తు చేసుకోవాలన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు మోదీ సిఎంగా ఉన్న సమయంలో అనేక కార్యక్రమాలకు వెళ్లలేదని గుర్తు చేశారు. రైల్వే ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రొటోకాల్ ప్రకారం బిఆర్ఎస్ ఎంపీల పేర్లు ఎక్కడా పేర్కొనలేదన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం.. బాలిక మృతి

- పాము కాటేసిందని వైద్యానికి వెళ్తే..
- ఎలుక కరిచిందంటూ గంట వరకూ అందని వైద్యం
- ప్రధాన రహదారిపై గ్రామస్తుల రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాము కాటేసిందంటూ వైద్యం కోసం తీసుకొస్తే.. ఎలుక కరిచిందంటూ వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అత్యవసరంగా అందించాల్సిన వైద్య సేవలు అందకపోవడంతో బాలిక మృతి చెందింది. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపురం ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం చోటుచేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు యాదగిరి, రజిత తెలిపిన వివరాల ప్రకారం... బెస్తగూడెం గ్రామానికి చెందిన తేజశ్రీ (6) ఆదివారం ఇంట్లో మంచంపై ఆడుకుంటుండగా.. బీరువా సమీపంలో ఉన్న పాము బాలిక కాలుపై కాటువేసింది. బాలిక వెంటనే తల్లిదండ్రులకు విషయాన్ని చెంపగా.. చికిత్స కోసం వెంకటాపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. తమ కూతురిని పాముకాటేసిందంటూ ఆస్పత్రి సిబ్బందికి తెలపగా.. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది వైద్యాధికారికి సమాచారాన్ని అందించారు. వైద్యాధికారి వచ్చి పాము కాదు.. ఎలుక కరిచిందంటూ గంటకు పైగా వైద్యం అదించలేదు. గంట తర్వాత బాలిక నోట్లో నుంచి నురగరావడం గమనించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం తరలించాలని సలహా ఇచ్చారు. బాలికను ఏటూరునాగారం తరలిస్తుండగా బాలిక మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఆగ్రహించిన బాలిక తల్లిదండ్రులు, గ్రామస్తులు.. పేరూరు-వెంకటాపురం ప్రధాన రహదారిపై అంబేద్కర్ సెంటర్ వద్ద బాలిక మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. రెండు గంటలకు పైగా ప్రధాన రహదారిపై బైఠాయించారు. దాంతో ఆందోళన స్థలానికి చేరుకున్న సిఐ శివప్రసాద్ బాలిక తల్లిదండ్రులతో మాట్లాడారు. వైద్యుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులకు వైస్ ఎంపిపి సయ్యద్ హుస్సేన్ ఫోన్‌లో వివరించారు. వైద్యులు సకాలంలో బాలికకు వైద్యం అందించి ఉంటే బాలిక బతికేదని, వైద్యుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బాలిక మృతి చెందిందని వైద్యాధికారిపై ఫిర్యాదు చేశారు. కాగా, వైద్యుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారని సిఐ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

మాస్టర్ హెల్త్‌చెకప్‌తో సత్ఫలితాలు

- మహిళా జర్నలిస్టుల ఆరోగ్య శిబిరం విజయవంతం
- 571 మందికి ఆరోగ్య పరీక్షలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో సమాచార శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా జర్నలిస్టుల ఆరోగ్య శిబిరంలో మొత్తం 571 మంది జర్నలిస్టులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గత మార్చి 29వ తేదీ నుండి ప్రారంభం అయిన ఆరోగ్య శిబిరం పది రోజుల పాటు అంటే ఆదివారం వరకు విజయవంతం కొనసాగింది.

ఆరోగ్య శిబిరం వైద్య ఆరోగ్య , సమాచార పౌర సంబంధాల శాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. మహిళా జర్నలిస్టులకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఆరోగ్య శిబిరాలు ప్రారంభించింది. రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కెటి రామారావు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇచ్చిన ఆదేశాల మేరకు మహిళా జర్నలిస్టులకు ఈ మాస్టర్ హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఏర్పాటు చేశారు. ఈ ఆరోగ్య శిబిరాలు అన్ని జిల్లాల్లోనూ ప్రారంభించారు.. మాస్టర్ హెల్త్ చెకప్ కార్యక్రమంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన 205 అక్రిడిటేటెడ్ మహిళా జర్నలిస్టులు, వివిధ పత్రికా, న్యూస్ ఛానెళ్లలో పనిచేస్తూ ఆర్గనైజేషన్ గుర్తింపు కార్డులు ఉన్న మరో 306 మంది మహిళా జర్నలిస్టులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. మాస్టర్ హెల్త్ చెకప్‌లో సీబీపీ, బ్లడ్ షుగర్, డయాబెటిక్ పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, కాల్షియం, మూత్ర పరీక్షలు, విటమిన్ డీ12, ఐ3 మొదలైనవి, ఉన్నాయి. ఈసీజీ, ఎక్స్-రే, అల్ట్రాసోనోగ్రఫీ, మామోగ్రామ్, పాప్ స్మెర్ వంటి రోగనిర్ధారణ పరీక్షలు జరిగాయి, స్క్రీనింగ్ పరీక్షలు, మెడికల్ ఆఫీసర్ ఎగ్జామినేషన్, ఐ స్క్రీనింగ్, డెంటల్ పరీక్షలు, గైనకాలజీ పరీక్షలు చేశారు. పరీక్షల నివేదికలను అదే రోజున అందచేశారు. వైద్య అధికారులు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారుల స్వీయ పర్యవేక్షణలో ఆరోగ్య శిబిరం జరిగింది. పరీక్షలు చేయించుకున్న మహిళా జర్నలిస్టులు ఈ కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఈ శిబిరం ఎంతో తోడ్పాటు ఇచ్చిందని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న మహిళా జర్నలిస్టులు తమ సంతృప్తిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శిబిరం నిర్వహణకు ప్రత్యేక చొరవ చూపిన సమాచార శాఖ కమిషనర్ , ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్య శిబిరం నిర్వహణలో తోడ్పాటు ఇచ్చిన సమాచార శాఖ అధికారులకు, ఆరోగ్యశాఖ అధికారులకు మహిళా జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నతాధికారులతో సమీక్షలు చాలవు

- క్షేత్రస్థాయిలో సమస్యలకు పరిష్కారమెలా?
- చిరుద్యోగుల బాధలు వినేదెవరు?
- బోధనాస్పత్రుల సూపరింటెండెంట్ల తీరుపై విమర్శలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'కేవలం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలతో సమస్యలు పరిష్కారం కావు. వ్యవస్థలో పాతుకుపోయిన అంసతప్తిని తొలగించేందుకు క్షేత్రస్థాయిలో పని చేసే వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి. నిధులు కేటాయిస్తున్నప్పటికీ ఆ మేరకు ఫలితం మాత్రం రావడం లేదు. కింది స్థాయిలో ఉద్యోగులు మరింత ఉత్సాహంగా పని చేయాలి. రోగుల్లో పెరిగిన నమ్మకాన్ని కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలి.' ఇలాంటి ఆలోచనలు, నిర్ణయాలతోనే వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు నెలవారీ సమీక్షలకు శ్రీకారం చుట్టారు. విభాగాల వారీగా ప్రతి నెల సమీక్షలు నిర్వహిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలపై ఆరా తీస్తూ, పనితీరు మెరుగైన వారిని అభినందిస్తూ, వెనుకబడిన వారికి సూచనలు, సలహాలిస్తూ జవాబుదారీ తనాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా క్రమం తప్పకుండా డిఎంఇ, డిహెచ్, టివివిపి, నిమ్స్, నిలోఫర్ తదితర విభాగాల వారీగా నిర్వహిస్తున్న సమీక్షా సమావేశాలు ప్రభుత్వానికి మంచి ఫీడ్ బ్యాక్‌ను ఇచ్చాయనే చెప్పాలి. ఈ సమీక్షల్లో నుంచి వచ్చిన సమాచారంతోనే సి-సెక్షన్లను తగ్గించేందుకు సహజ ప్రసవాలు చేసే వారికి ప్రోత్సాహకాలు అందివ్వాలని నిర్ణయించారు. మంత్రి వరకే పరిమితమైన సమీక్షలు కింద స్థాయిలో అధికారులు అందుకోవడం లేదనే వాదన వినపడుతోంది. ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, అధికారులు రౌండ్స్‌కు తప్పనిసరిగా వెళ్లాలని మంత్రి ఆయా సందర్భాల్లో ఆదేశిస్తూనే ఉన్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఇప్పటికీ చాలా ఆస్పత్రుల్లో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. సమీక్షలు చేయరు అనే విమర్శలే సూపరింటెండెంట్లపై వినపడుతున్నాయి. దీంతో ఒకరిద్దరు ఆస్పత్రి అధికారులు చెప్పే విషయాలపైనే పూర్తి ఆధారపడుతూ "వచ్చామా... వెళ్లామా" అన్నట్టుగా కొందరి వ్యవహారం తయారైంది. కింద స్థాయిలో సమస్యలు నెలల తరబడి పేరుకుపోతున్నా..... వాటికి మోక్షం లభించడం లేదు. పేద ప్రజలకు కోట్లాది రూపాయలు వెచ్చించి మెరుగైన వైద్యం అందించాలనే ప్రభుత్వ సంకల్పానికి ఇలాంటి వారి చర్యలు ఆటంకంగా మారుతున్నాయి. తాగునీరు, పారిశుధ్యం, సెక్యూరిటీ సమస్యలు, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో రోగుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతూనే ఉంది.

మంత్రి మాదిరిగా....

మంత్రి నిర్వహిస్తున్నట్టు విభాగాల వారీగా నెలవారీ సమీక్షలు ఆస్పత్రుల్లోనూ నిర్వహిస్తే బాగుంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికే వైద్యారోగ్యశాఖ ప్రక్షాళన, పనితీరు మెరుగుపరిచేందుకు మంత్రి విస్తృతస్థాయి సమావేశాలు దోహదపడ్డాయని వారు అభిప్రాయపడుతున్నారు.